దేవస్థానంలో మొక్కలు నాటిన చైర్మన్,ఈఓ



మొక్కలు నాటుతున్న ఆలయ చైర్మన్ నాగిరెడ్డి, ఈవో

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్ర దేవస్థానంలో ఆలయ పాలక మండలి చైర్మన్ పి. నాగిరెడ్డి, ఈఓ సతీశ్ బాబు సోమవారం మొక్కలు నాటారు. భక్తులకు భక్తితో పాటు ప్రశాంతత, ఆహ్లాదకర వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అర్చకులు బలరామకృష్ణ శర్మ, భక్తులు వి.కె. రావు, నాగరాజు పాల్గొన్నారు.

నేడు గ్యాస్ట్రో ఎంట్రాలజీపై అవగాహన

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈనెల 10న గ్యాస్ట్రో ఎంట్రాలజీకి సంబంధించిన అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా డాక్టర్ పవన్ రెడ్డి తొండపు, ఎంబీబీఎస్, ఎండీ, డీఎం పాల్గొని అవగాహన కల్పించనున్నట్లు పేర్కొన్నారు. వడ్డేపల్లి కమలమ్మ సీనియర్ సిటిజన్ హాల్‌లో సాయంత్రం 5.30 గంటలకు ఉంటుందని, పరిసర ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని వారు సూచించారు.

మంత్రికి శుభాకాంక్షలు



మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో యాదగిరి, నాయకులు

ఆల్విన్‌కాలనీ: రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను వివేకానందనగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాషిపాక యాదగిరి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి డివిజన్ సీనియర్ నాయకులు కుమార్ యాదవ్, సంజీవరావు, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి యాదగిరి, బొల్లం యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రసిద్ధ ఆలయాల సందర్శనకు సూపర్ లగ్జరీ బస్సులు

మియాపూర్: ఆర్టీసీ మియాపూర్-1డిపో పరిధిలో తెలంగాణ ప్రసిద్ధ దేవాలయాల సందర్శనకు ప్రతి శని, ఆదివారాల్లో సూపర్ లగ్జరీ బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ వి. మోహన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. స్వర్ణగిరి, యాదగిరిగుట్ట, జైన మందిర్, భద్రకాళి దేవాలయం, వేయి స్తంభాలు, లక్నవరం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, బొగ్గట్ట వాటర్ ఫాల్స్, మేడారం, రామప్ప ఆలయాలకు రెండు రోజుల పాటు ప్రత్యేకంగా నడుస్తున్నాయని తెలిపారు.ఈ బస్సులు మియాపూర్ నుండి ఉదయం 5 గంటలకు బయల్దేరి పలు దేవాలయాల దర్శనాల అనంతరం మరుసటి రోజు రాత్రి 10 గంటలకు మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. 30 మందికంటే ఎక్కువ భక్తులు ఉంటే ఏ రోజైనా దేవాలయాల సందర్శనకు పంపుతామన్నారు. వివరాలకు 8500309052,7659029882 ,9959226153 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డీసీకి వినతి



డీసీకి సమస్యలు వివరిస్తున్న మహేశ్ యాదవ్

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని సోమవారం చందానగర్ సర్కిల్ -21 ఉప కమిషనర్ మోహన్‌రెడ్డికి బీజేపీ నాయకులు బోయిని మహేష్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నాయని, రోడ్లను ఆక్రమించడం వల్ల అంబులెన్స్, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలపై ఇప్పటికే పలుమార్లు అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు పవన్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు వేసేదెన్నడో..?

- అభివృద్ధి పనుల కోసం తవ్వకాలు
- నిర్మాణాలు పూర్తయినా.. రోడ్లు వేయని వైనం
- ఇబ్బందుల్లో కాలనీవాసులు
- పట్టించుకోని అధికారులు



యూసుఫ్‌నగర్‌లో రోడ్డు వేయని ప్రాంతం



రాణాప్రతాప్‌నగర్‌లో కంకర వేసి వదిలేసిన దృశ్యం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ యూసుఫ్‌నగర్ ప్రధాన రోడ్డు సమీపంలో వర్షపు నీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళ్లేలా పైపులు వేసి డ్రైనేజీకి అనుసంధానం చేశారు. అంతవరకు బాగానే ఉన్నా పనుల కోసం తవ్విన సీసీ రోడ్డును మళ్లీ వేయకపోవడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అసలే వానకాలం..ఎప్పుడూ వర్షాలు కురుస్తాయో తెలియని పరిస్థితి నెలకొన్నది. మరోవైపు ప్రధాన రోడ్డుకు సమీపంలో ఉండడంతో రాత్రివేళల్లో వెళ్తే ఎప్పుడూ ఏ ప్రమాదం జరుగుతుందోనని వారు ఆందోళన చెందుతున్నారు. అకాల వర్షాలు కురిస్తే మళ్లీ వరద నిల్వ ఉండడంతో పాటు బురదమయంగా తయారవుతుందని వారు వాపోతున్నారు. మరోవైపు రాణాప్రతాప్‌నగర్‌లో డ్రైనేజీ రోడ్డు నిర్మాణం పూర్తయినా.. తవ్విన రోడ్డు పనులు మాత్రం చేపట్టలేదు. కేవలం కంకర వేసి వదిలేశారు. దీంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై స్థానికులు పలుమార్లు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి యూసుఫ్‌నగర్, రాణాప్రతాప్‌నగర్‌లో రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఆయా కాలనీవాసులు కోరుతున్నారు.

రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం..



యూసుఫ్‌నగర్‌లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక పైపులు వేసి డ్రైనేజీకి అనుసంధానం చేయడం సంతోషించదగ్గ విషయమే. కానీ కొన్ని రోజులుగా రోడ్డు వేయకుండా అలాగే వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– నార్లపురం నాగరాజు,యూసుఫ్‌నగర్

ప్రభుత్వాసుపత్రిలో టీబీపై అవగాహన



పాల్గొన్న ఎల్లమ్మబండ ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది

ఆల్విన్‌కాలనీ: 'టీబీ ముక్తి భారత్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఎల్లమ్మబండలోని ప్రభుత్వాసుపత్రిలో ఏఐ ఎక్స్‌రే ద్వారా వ్యాధి నిర్ధారణ, టీబీపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ ఆఫీసర్ మాట్లాడుతూ..2 వారాలకు మించి ఉండే దగ్గు, దగ్గినప్పుడు, శ్వాస తీసుకున్నప్పుడు, ఛాతి నొప్పి, బరువు తగ్గడం, అలసట, బలహీనత, సాయంత్రం జ్వరం రావడం, రాత్రిపూట చెమటలు రావడం, ఆకలి లేకపోవటం, శ్వాస ఆడకపోవటం వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. దేశాన్ని టీబీ రహితంగా మార్చాలనే భారత ప్రభుత్వ లక్ష్యంగా ఆరోగ్య అధికారులు, సమాజ కార్యకర్తలు, స్థానిక నాయకుల భాగస్వామ్యం ద్వారా టీబీ నిర్మూలన ప్రయత్నాలు ముమ్మరం చేశామన్నారు. కార్యక్రమంలో టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ శ్రీదేవి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ విజయచంద్ర, సూపర్‌వైజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కాలేజీ సందర్శన



కళాశాలలో కాంతారావు తదితరులు

మూసాపేట: నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కూకట్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు సోమవారం సందర్శించారు. బోధన తీరు, అడ్మిషన్ల ప్రక్రియను ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏఐ ఆధారిత డిజిటల్ విద్యాబోధన అమలు చేయాలని, అదేవిధంగా మరుగుదొడ్లు, ఆట స్థలం, లైబ్రరీతో అన్ని వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వినోద్ కుమార్ గౌడ్, భగవంత్ రెడ్డి, గోపి, సూరిబాబు, వెంకటరమణ, జగదీష్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో కార్పొరేటర్ పర్యటన



వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: బస్తీ పర్యటనలో భాగంగా డివిజన్ కార్పొరేటర్ కె. మహేందర్ వాటర్ వర్క్స్ అధికారులతో కలిసి మూసాపేటలో సోమవారం పర్యటించారు. హనుమాన్‌చౌక్ నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు గతంలో 600 ఎంఎం దయా యూజీడీ పైపులైన్ వేయాలని వాటర్ వర్క్స్ ఎండీ, జనరల్ మేనేజర్ తెలపడంతో వాటర్ వర్క్స్ ఇన్‌స్పెక్టర్ వినయ్ ఎస్టిమేషన్ తయారు చేస్తానని తెలిపారు. అదేవిధంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహం వద్ద తాగునీటి పైపులైన్‌ను 6 ఇంచ్‌లకు పెంచి నూతన పైపులైన్ వేయాలని సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



జయశంకర్‌నగర్‌లో స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న తిరుపతి

ఓల్డ్ బోయిన్‌పల్లి: మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆదేశాలతో బీజేపీ కాంటెస్టెడ్ కార్పొరేటర్ ఎనుగుల తిరుపతి చొరవతో జీహెచ్ఎంసీ అధికారులు సోమవారం విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. వారం క్రితం తిరుపతి ఆధ్వర్యంలో జయశంకర్‌నగర్ కాలనీ, హరిజన బస్తీ ప్రజలు ఎంపీని కలిసి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతూ విన్నవించారు. స్పందించిన ఎంపీ జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్, జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ డీఈ స్వప్నకు స్తంభాలు ఏర్పాటు కోరుతూ అధికారులకు లెటర్ పంపించారు. స్పందించిన వారు ఆయా ప్రాంతాలను పరిశీలించి సోమవారం 18 స్తంభాలు ఏర్పాటు చేశారు. త్వరలోనే వీధిదీపాలు కూడా అమర్చుతామని తెలిపారని తిరుపతి చెప్పారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావు, అశోక్‌యాదవ్, రమేశ్, దేవయ్య, మణి, రవి, సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల్లో అధిక ఫీజులు నియంత్రించాలి



అశ్వంత్ కుమార్

ఆల్విన్‌కాలనీ: విద్యాసంస్థల్లో అధిక ఫీజులను నియంత్రించాలని బీఆర్ఎస్వీ స్టేట్ జనరల్ సెక్రటరీ అశ్వంత్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. డొనేషన్, అడ్మిషన్ల పేరిట ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేసి విద్యను వ్యాపారంగా మార్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యను వ్యాపారంగా మారిస్తే దేశ భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మూసాపేట: కూకట్‌పల్లి ఐడీఎల్ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా డయల్ 100కు ఓ వ్యక్తి చనిపోయి ఉన్నట్లు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని పూర్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రిక ప్రసాద్ గౌడ్

మియాపూర్: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ అధ్యక్షురాలు పి.చంద్రిక ప్రసాద్‌గౌడ్ అన్నారు. మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో మియాపూర్‌లో నియోజకవర్గ ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అగ్ర నాయకుల ఆదేశాల మేరకు నియోజకవర్గంలో బూత్ కమిటీల బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళా నాయకులు కీలకపాత్ర పోషించాలన్నారు. ప్రతినెల మొదటి వారంలో జిల్లాస్థాయి ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంతో పాటు నాయకత్వ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. మహిళా నాయకులు శ్రీదేవి, భాగ్యలక్ష్మీ, జిల్లా సెక్రటరీ రాణి, డివిజన్ల అధ్యక్షులు రాజ్యలక్ష్మీ, విమల, లక్ష్మీ, శ్రీజ్యోతి, సుప్రజ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఠాకూర్ అంకిత్ సింగ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



మహేశ్‌ను సన్మానిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్‌గౌడ్

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ తులసీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన ఠాకూర్ అంకిత్ సింగ్ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఠాకూర్ అంకిత్ సింగ్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. త్వరలో తులసీనగర్‌లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాయకుడు దండు పాండు యాదవ్, మహిపాల్ సింగ్, ఉప్పల దామోదర్ నేత, శ్రీకాంత్, చింటూ, విక్కీ, కిరణ్, చందు, కిశోర్, మోహిత్ పాల్గొన్నారు.

జయశంకర్ కాలనీ అధ్యక్షుడు..

ఆల్విన్‌కాలనీ: జయశంకర్ కాలనీ నూతన అధ్యక్షుడు మహేశ్ కాలనీవాసులతో కలిసి డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్‌ను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహేశ్‌ను శాలువాతో సన్మానించి, అభినందించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నూతన కమిటీ సభ్యులు కాలనీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తులసీనగర్ అధ్యక్షుడు..

కూకట్‌పల్లి: అల్లాపూర్ డివిజన్ తులసీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు అంకిత్ సింగ్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావును సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు అంకిత్ సింగ్‌ను శాలువాతో సన్మానించి, అభినందించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆదర్శనగర్‌లో పర్యటించిన కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిని అభివృద్ధిలో మోడల్‌గా తీర్చిదిద్దుతానని కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఆదర్శనగర్‌లో జరుగుతున్న పనులను ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాగేందర్‌యాదవ్ మాట్లాడుతూ డ్రైనేజీ పనులు పూర్తి చేసిన తర్వాత సీసీ రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. ఆయా పనులు త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు స్థానికులకు ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ఏఈ భాస్కర్, మాజీ కౌన్సిలర్ సోందాస్, కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, సత్యనారాయణ, రమేష్, నరసింహారెడ్డి, కృష్ణ గౌడ్ పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెస్తాం

కుత్బుల్లాపూర్: పార్కుల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ అన్నారు. కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అభివృద్ధి చేయనున్న పార్కు స్థలాలను సోమవారం పరిశీలించారు. జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వైష్ణవి ఎన్‌క్లేవ్‌లోని 2017 గజాల పార్కు స్థలాన్ని సందర్శించి వెంటనే ప్రణాళికలు సిద్ధం చేయాలని హార్టికల్చర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పార్కు స్థలాల్లో అక్రమ నిర్మాణాలు ఉంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ పద్మనాభ, జోనల్ మేనేజర్ రఘువీర్ రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎం.పి.ఆర్ చంద్రశేఖర్, కోశాధికారి రాకేశ్ కుమార్, రాజు, కిరణ్, ఆర్గనైజర్ శివకుమార్ పాండే తదితరులు ఉన్నారు.

వివాహేతర సంబంధం విషయంలో దాడి

జీడిమెట్ల: వివాహేతర సంబంధం విషయంలో ఓ వ్యక్తి ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి గాయపరిచిన ఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇందిరానగర్ కాలనీకి చెందిన ప్రదీప్‌సింగ్ (34) షాపూర్‌నగర్ రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన మాయ సిద్దర్ ఇద్దరు కలిసి స్పా వ్యాపారం నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో ప్రదీప్‌సింగ్ మాయాతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయమై ప్రదీప్‌సింగ్ అతని భార్య పింకీ మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. కాగా ఆదివారం మాయ పుట్టినరోజు ఉండడంతో మాయ భర్త వెంకటరమణ ప్రదీప్‌సింగ్‌కు ఫోన్ చేసి బర్త్‌డే వేడుకలకు రావాలని కోరగా ప్రదీప్‌సింగ్ అతని స్నేహితులు సింగ్, వినయ్‌ను తీసుకుని సంజయ్‌గాంధీనగర్‌లోని మాయ ఇంటికి వెళ్లారు. అందరూ కలిసి మద్యం తాగిన తర్వాత సోమవారం తెల్లవారుజామున వెంకటరమణ నా భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకుంటావా అంటూ ప్రదీప్‌సింగ్‌తో గొడవపడ్డాడు. ఈ క్రమంలో కోపోద్రిక్తుడైన వెంకటరమణ సుత్తితో ప్రదీప్‌సింగ్ తలపై కొట్టాడు. అడ్డువచ్చిన సూరజ్‌సింగ్, వినయ్‌పై కూడా దాడి చేయగా తీవ్రగాయాలు కావడంతో ముగ్గురిని షాపూర్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. కాగా ప్రదీప్‌సింగ్ భార్య పింకీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజా పాలనపై ప్రజల్లో సన్నగిల్లిన నమ్మకం

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



చెరువు సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ఓల్డ్ బోయిన్‌పల్లి: కాంగ్రెస్ ప్రజా పాలనపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. హస్మత్‌పేట బోయిన్ చెరువు సుందరీకరణ పనులను డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహాయాదవ్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. కట్టపై వ్యర్థాలు, మట్టి కుప్పలను చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం కార్పొరేటర్ నివాసంలో వివిధ విభాగాల అధికారులు, కాలనీలు, బస్తీల అసోసియేషన్ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం రూ. 17 కోట్లతో చెరువు సుందరీకరణ పనులు మొదలు పెట్టామని ఇందులో భాగంగా దోమల నిర్మూలనకు గుర్రపు డెక్క తొలగించడం, చెరువు శుద్ధితో బతుకమ్మ కుంటను అందంగా తీర్చిదిద్దామని గుర్తు చేశారు. చెరువు సుందరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 18 నెలలు గడుస్తున్నా.. నెలకు రూ. 65 లక్షలు నిధులు ఇస్తే ఏం అభివృద్ధి చేయాలని ప్రశ్నించారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లోని కల్యాణ్ థియేటర్ దగ్గర వరద నిల్వకుండా డ్రైనేజీని ఏర్పాటు చేయాలని 8 నెలల క్రితం రూ. 18 లక్షలు నిధులు విడుదల చేస్తే అధికారులు ఇప్పటివరకు ఎస్టిమెట్ వేయకుండా టెండర్లు పిలవకుండా అలసత్వం వహిస్తున్నారని అసహనం వ్యక్తం చేశారు. అలాగే పలు కాలనీల అసోసియేషన్స్, బస్తీల సభ్యులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, నాయకులు ఇర్ఫాన్, మేకల హరినాథ్, నరేందర్‌గౌడ్, మక్కాల నర్సింగ్‌రావు, బల్‌రాజు, సయ్యద్ ఏజాజ్, కర్రె జంగయ్య, మక్కాల సత్యనారాయణ, నగేశ్ ముదిరాజు, పోచయ్య, మట్టి శ్రీను, పిట్ల రాజు, బుర్రి యాదగిరి, లలితా, సరోజాదేవి, ఉదయరాణి, ఉమాతో పాటు పలు కాలనీలు, బస్తీల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462